రెండు దశాబ్దాల కల.. నెరవేరిన వేళ

- ఉద్యోగాల క్రమబద్ధీకరణకు మార్గం సుగమం
- అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం
- కాంట్రాక్టు, తాత్కాలిక ఉద్యోగుల ఆనందోత్సాహం

గణపవరం: కాంట్రాక్టు ఉద్యోగులు, తాత్కాలిక ఉద్యోగుల క్రమబద్ధీకరణ జరిగే పనికాదు. ఎట్టి పరిస్థితుల్లోనూ వారిని రెగ్యులర్ చేయడం సాధ్యం కాదు. కావాలంటే వారికి కొద్దిగా వేతనాలు పెంచగలమంటూ సరిగ్గా ఏడేళ్ల క్రితం ఇదే రోజున అంటే 2016 సెప్టెంబర్ 27న తెలుగుదేశం ప్రభుత్వం ప్రకటించింది. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై ఇదేరోజున ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు నేతృత్వంలో సమావేశమైన మంత్రివర్గ ఉప సంఘం, ఉద్యోగ సంఘాల నాయకుల సమక్షంలో మంత్రి చేసిన ప్రకటన ఇది. దీనితో అంతవరకూ ఏళ్ల తరబడి తమ ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని, తమకు మంచి వేతనాలు వస్తాయని ఎంతో ఆశతో ఎదురుచూసిన తాత్కాలిక ఉద్యోగులు నీరుగారిపోయారు. అనంతరం ప్రజా ప్రస్థానం పాదయాత్ర చేసిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గణపవరం వచ్చిన సందర్భంగా ఏపీ పబ్లిక్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు నామాల రాజు ఆధ్వర్యంలో సంఘ నేతలు ఆయనను కలిసి తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలు తెలుసుకున్న జగన్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సరిగ్గా ఏడేళ్ల తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం కుదరదన్న రోజునే అంటే సెప్టెంబర్ 27న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడానికి ప్రతిపాదించిన బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించింది. దీనితో తమకు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి జగన్‌కు కాంట్రాక్టు ఉద్యోగులు, వారి కుటుంబాలు కృతజ్ఞతలు తెలుపుతున్నాయి. తమ జీవితాల్లో వెలుగులు నింపిన జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామని చెబుతున్నారు. బుధవారం అసెంబ్లీలో ఆమోదించిన కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ బిల్లు వల్ల రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10 వేల మందికి పైగా లబ్ధి కలుగనుంది. అత్యధికంగా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో 3,550 మంది, వైద్య ఆరోగ్యశాఖలో 3,396 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కానున్నారు. వీరితో పాటు వివిధ శాఖలలో మరో 3వేల మంది తాత్కాలిక ఉద్యోగులు రెగ్యులర్ కానున్నారు.


గణపవరంలో ప్రజాప్రస్థానంలో వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందించిన కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్)

థ్యాంక్యూ సీఎం సార్



ఒప్పంద ఉద్యోగుల కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. తమ ఉద్యోగాలు రెగ్యులర్ చేయాలని రెండు దశాబ్దాలుగా పోరాడుతున్నాం. వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబు హయాంలో వినతిపత్రాలు సమర్పించాం. తెలుగుదేశం ప్రభుత్వం రెగ్యులర్ చేయడం కుదరదని తేల్చి చెప్పడంతో అంతా నిరాశకు లోనయ్యాం. ఎట్టకేలకు తమ గోడును ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పట్టించుకున్నారు.

– నామాలరాజు, ఒప్పంద ఉద్యోగుల సంఘం నేత

శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటించాలి

దెందులూరు: ఆయిల్‌ఫామ్‌లో గానోడెర్మ అత్యంత హానికరమైన తెగులని ఎస్‌ఆర్‌సీ సైంటిస్టు ఎఆర్‌ఎస్ ఎస్ సుబ్బన్న అన్నారు. బుధవారం కొక్కిరపాడులో పతంజలి ఫుడ్స్ సీనియర్ మేనేజర్ మోహన్ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ సాగు, గానోడెర్మ వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానిక రైతులకు అవగాహన కల్పించారు. తెగులు సోకిన తోటకు సూడోఇనాస్ పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆయిల్‌పామ్ సాగు చేయాలని సైంటిస్టు సుబ్బన్న అన్నారు.

15 హెచ్‌పీ మోటార్లు ఇవ్వాలి

ఉంగుటూరు: వైఎస్సార్ జలకళలో బోర్లు వేసుకున్న రైతులకు పైపులు, 10 హెచ్‌పీ మోటార్లు వచ్చాయి. వాటిస్థానే 15 హెచ్‌పీ మోటార్లు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. పైపులు వచ్చి 15 రోజులైనా వాటిని రైతులు తీసుకెళ్లలేదు. దాంతో ఆ రైతులతో డ్వామా ఏపీవో పి.సుధాకర్, ఉంగుటూరు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మల్లేశ్వరరావు, సహాయకుడు ప్రసన్నరాజు కైకరం, గొల్లగూడెం, నీలాద్రిపురం, తదితర మెట్ట ప్రాంత గ్రామాల రైతులతో బుధవారం సమావేశమై చర్చించారు. అధిక వ్యయమైనా భరిస్తామని రైతులు అధికారులకు చెప్పారు.

క్లుప్తంగా

భోగాపురం పంచాయతీలో కేంద్ర బృందం తనిఖీ


తనిఖీ చేస్తున్న పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ డిప్యూటీ కార్యదర్శి విజయకుమార్

పెదవేగి : ఆర్థిక సంఘం నిధుల నుంచి పంచాయతీలు విద్యుత్తు బిల్లుల చెల్లింపులపై కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ డిప్యూటీ కార్యదర్శి విజయకుమార్ బుధవారం పెదవేగి మండలం భోగాపురం పంచాయతీ కార్యాలయంలో ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన ఆర్థిక సంఘం నిధుల నుంచి విద్యుత్తు బిల్లుల చెల్లింపుల్లో సర్పంచి, పంచాయతీ కార్యదర్శుల పాత్రపై ఆయన ఆరా తీశారు. భోగాపురం సర్పంచి దిమ్మిటి నాగమల్లేశ్వరి, పంచాయతీ కార్యదర్శి కె.ధర్మావతిని ఆయన ప్రశ్నించారు. బిల్లుల చెల్లింపులకు ప్రభుత్వం అనుమతి ఉందా, లేదా మీరే చెల్లించారా అని అడిగి వివరాలను నమోదు చేసుకున్నారు. 2020–21 సంవత్సరంలో రూ.52 లక్షలు చెల్లించామని, ఇంకా రూ.14 లక్షల బకాయిలు ఉన్నాయని సర్పంచి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ జెడ్పీ సీఈవో రవికుమార్, డీఎల్పీవో చంద్రశేఖర్, ఎంపీడీవో రాజ్మానోజ్, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు ఉన్నారు.

పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలన

ఉంగుటూరు: ఎ.గోకవరం, యూపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు వడ్డిస్తున్న ఆహారం నాణ్యతా ప్రమాణాలను విజిలెన్సు కమిటీ సభ్యుడు కోనే వీరవెంకట సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. భోజనం ఎలా అందుతోందని విద్యార్థులను ప్రశ్నించి వారి అభిప్రాయాన్ని తెలుసుకున్నారు. స్టాకు రిజిస్టరును పరిశీలించారు. అంగన్‌వాడీ సెంటర్లో తనిఖీ చేసి విద్యార్థులకు, గర్భిణులకు అందుతున్న ఆహారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

గణపవరం: గణపవరం బాలుర హైస్కూలుకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికైనట్లు పీడీ పద్మావతి తెలిపారు. నారాయణపురంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఆడదాం ఆంధ్ర ఆటల పోటీల్లో ప్రణయ్‌జోసఫ్ అండర్ 17 వాలీబాల్ పోటీలకు, మహేష్ పోసిరాం అండర్ 14 చెస్ పోటీలకు, నవీన్ అండర్ 17 చెస్ పోటీలకు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఇంతకు ముందు వివిధ విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు పదిమంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు ఎన్‌ఎస్‌ఆర్‌కే విద్యార్థులు

ఏలూరు రూరల్: అక్టోబర్ 15 నుంచి 17 వరకు వరంగల్‌లో నిర్వహించే జాతీయ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు స్థానిక నంది శివరామకృష్ణ కళాశాల విద్యార్థులు ఐదుగురు ఎంపికయ్యారని కరస్పాండెంట్ డి.రవికుమార్ తెలిపారు. ఇటీవల ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరిగిన 36వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు పతకాలు సాధించారని హర్షం వ్యక్తం చేశారు. మూడు గోల్డ్, ఒక సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్ వచ్చాయన్నారు. ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ చదువుతోన్న కేఎస్ఎస్ సహిల్‌బాబు రెండు బంగారు పతకాలు సాధించిన ఉత్తమ అథ్లెట్‌గా అవార్డు అందుకున్నాడని వివరించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటుతున్నారని వెల్లడించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్: ఏలూరు మండల, నగర పరిధిలో తొమ్మిది వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం సరళకుమారి తెలిపారు. చాటపర్రు–2, సత్రంపాడు, శ్రీపర్రు, మొండికోడులో ఒక్కొక్కటి చొప్పున, వెంకటాపురంలో నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అక్టోబర్ 3న దరఖాస్తుల పరిశీలన, 4న మౌఖిక పరీక్ష, 5న ఎంపికైన వలంటీర్ల వివరాలు వెల్లస్తామరు.

పార్థసారధి, శ్రీహరికోటిలకు పురస్కారం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మాతృభాషా సంస్కృతి – సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా భాష, సాహిత్య, సామాజిక, కళ, విద్య, వైద్య రంగాల్లో సేవలందిస్తోన్న వారిని గుర్తించి ఫిలాంతోరఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా సంస్థ అందిస్తోన్న గుర్రం జాషువా ప్రతిభా పురస్కారానికి శ్రీశ్రీ కళావేదిక ఏలూరు జిల్లా శాఖ గౌరవాధ్యక్షుడు టి.పార్థసారధి, శ్రీహరి కోటి ఎంపికయినట్టు ఆ సొసైటీ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా యోనా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28న నగరంలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి చేతుల మీదుగా వారికి పురస్కారం ప్రదానం చేయనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే


దెందులూరు: రామారావుగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించి టోకెన్ అందిస్తున్న వైద్య సిబ్బంది


పెదవేగి: నాగన్నగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్ మహిళకు అందిస్తున్న ఎంపీడీ రాజ్‌మనోజ్, డాక్టర్ మాధవి

దెందులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని రామారావుగూడెం సర్పంచ్ పర్వతనేని శ్రావణిసుధీర్, ఉప సర్పంచ్ కొస్సె శ్రీనివాసరావు, ఎంపీటీసీ కాలి ఇస్రాయేలు అన్నారు. శనివారం ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు రామారావుగూడెం, మలకచర్లలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలులో భాగంగా ఇంటింటికీ వెళ్లి బీపీ, సుగర్, జ్వరం, మలేరియా, డెంగీ, రక్త పరీక్షలు ఉచితంగా చేశారు. వారి వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేశారు. చల్లచింతలపూడి, శ్రీరామవరం, పోతునూరు, ఉండ్రాజవరంలో వేగవంతంగా సర్వే నిర్వహిస్తున్నారు. ఏఎన్ఎం మౌనిక, ఆశాకార్యకర్తలు గంగారత్నం, రాజేశ్వరి ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

పెదవేగి : ప్రజల ఆరోగ్యమే పరమావధిగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) వైద్యాధికారిణి డాక్టర్ మాధవి అన్నారు. బుధవారం పెదవేగి మండలం కొప్పులవారిగూడెం పంచాయతీ నాగన్నగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాధవి మాట్లాడుతూ అందరికీ ఆరోగ్యం అందే విధంగా, ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని చెప్పారు. ఇందులో గ్రామాల వారీగా ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశ వర్కర్లతో సర్వే నిర్వహిస్తున్నామని, ఈ సర్వేలో అవసరమైన వారికి ఏడు రకాల పరీక్షలు నిర్వహించి, కుటుంబానికి ఒక టోకెన్ ఇస్తున్నామని తెలిపారు. ఈ టోకెన్ పొందిన వారు ఆయా గ్రామాల్లో నిర్దేశించిన సమయంలో ఏర్పాటుచేసిన మెడికల్ క్యాంప్‌లో పాల్గొంటే, ఉచిత వైద్యం, మందులు అందిస్తామని డాక్టర్ మాధవి వివరించారు. వైద్య శిబిరంలో వైద్య నిపుణులు పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీను జి.రాజ్‌మనోజ్ పర్యవేక్షించారు. ఆయన వెంట స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు ఉన్నారు.

పేద కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు అందజేయాలి


అసెంబ్లీలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: భూమి మీద అత్యంత నిజాయతీగా పనిచేసే వాళ్లల్లో రైతులు అందరి కంటే ముందుంటారని వారు ప్రపంచానికే వెన్నుముక అని, వారిని ఆదుకోవడం కోసం ఎంతటి కష్టాన్ని అయినా ఎదుర్కోవాల్సి ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. బుధవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి ఎండనక, వాననకా, పనిలో ఎంత కష్టం ఉన్నా నలుగురికీ అన్నం పెట్టాలన్న ఉద్దేశ్యంతో రైతులు సాగు చేస్తారని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలను ఆయన ఉదహరించారు. రైతులు బాగుండాలనే లక్ష్యంతో రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శ విధానాలు అమలు చేస్తున్నారన్నారు. గతంలో వ్యవసాయం దండగా అనుకునే స్థాయి నుంచి ఈ నాలుగున్నరేళ్లలో వ్యవసాయం పండుగ అనే విధంగా ఆయన మార్చారన్నారు. రాష్ట్రంలో నాల్గవ వంతుపైబడి కౌలు రైతులున్నారని, వారికి భూమిపై ఎటువంటి హక్కు ఉండదన్నారు. పంట పండుతుందో లేదో తెలియదు. కష్టం వస్తే భరించాలి, బ్యాంకులు అప్పులు ఇవ్వవు, అందుకే వారికి పెద్దపీట వేసి సీఎం సీసీఆర్‌సీ కార్డులు అందించి అండగా నిలుస్తున్నారన్నారు. ఇప్పుడు కౌలు రైతులకు కూడా రైతుభరోసా అందుతోంది. ఇన్‌పుట్ సబ్సిడీ వస్తోంది. బ్యాంకులు రుణాలు అందిస్తున్నాయి. 9 లక్షల మంది రైతులకు పంట రుణాలు అందించారు. ఓబీసీలో ఉన్న పేద రైతులందరికీ సీసీఆర్‌సీ కార్డులు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సీసీఆర్‌సీ కార్డుల జారీలో సాంకేతిక సమస్యలు తొలగించేందుకు చర్యలు తీసుకుని కౌలురైతుల అభివృద్ధి, బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కోరారు.

బాలల సంరక్షణకు పటిష్టమైన చర్యలు


దెందులూరు బాలసదనంలో విద్యార్థులతో డాక్టర్ రాజేంద్రప్రసాద్, జిల్లా అధికారులు

దెందులూరు: బాలలకు న్యాయచట్టంలో రూపొందించిన రక్షణ, సంరక్షణ అమలుకు ఏపీ బాలల హక్కుల కమిషన్ పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని కమిటీ మెంబరు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రిబ్బికారాణి అధికారులతో కలిసి బుధవారం దెందులూరులోని ప్రభుత్వ బాలల సదనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు, రికార్డులు, గదులు, భవన ప్రాంగణాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులను విడివిడిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. దెందులూరు బాలసదనం నిర్వహణపై కమిషన్ మెంబరు డాక్టర్ రాజేంద్రప్రసాద్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రిబ్బికారాణి, డీసీపీఓ సూర్యచక్రవేణి, జిల్లా ప్రొబిషన్ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మల్లిక సంతృప్తి వ్యక్తం చేశారు.

ఎలుకల నివారణ ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టి


భీమడోలు: ఎలుకల నివారణ మందును అందిస్తున్న జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, పి.సత్యనారాయణ


ఉంగుటూరు: నారాయణపురంలో ఎలుకల నివారణ మందును అందజేస్తున్న నాయకులు

భీమడోలు: రైతుల ఆర్థిక నష్టాలకు కారణమైన ఎలుకలను నివారించడం ద్వారా రైతులు ఆర్థిక పరిపుష్టిని సాధిస్తారని భీమడోలు జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ అన్నారు. భీమడోలులోని గోదావరి కాల్వ వంతెన వద్ద బుధవారం మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు సామూహిక ఎలుకల నివారణ మందును ఉచితంగా పంపిణీ చేసారు. మండల పరిధిలోని సార్వా సీజన్‌లో సాగు చేసిన 13181 ఎకరాల్లోని రైతులకు 70 కేజీల బ్రోమోడయోలిన్ రైతులకు పొట్లాల రూపంలో జెడ్పీటీసీ భవానీ రంగ, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ పంపిణీ చేసారు. ఐదు కేజీల నూకలు, 100 గ్రాముల బ్రోమోడయోలిన్, 100 మిల్లీ గ్రాముల నూనెను కలిపి నివారణ మందును తయారు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సార్వా సీజన్‌లో ఎలుకలు ఉధృతి ఉండే సీజన్‌లో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టడం చాలా సంతోషదాయకమన్నారు. ఏవో ఎస్‌పీవీ ఉషారాణి మాట్లాడుతూ రైతులు పొట్లాల రూపంలో అందించిన మందును ఎలుకల బోరియాల్లో రైతులు ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు కడగల సత్యనారాయణ, వీఏఏలు సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకలు నివారణ మందు పంపిణీ

ఉంగుటూరు: ఎలుకలు నివారణ మందును రైతులకు నారాయణపురంలో బుధవారం ఎంపీటీసీ బండారు నాగరాజు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బండారు నాగరాజుతోపాటు మరో ఎంపీటీసీ మహాలక్ష్మి దానయ్య, రైతు భరోసా కేంద్రం చైర్మన్ మతుకుమిల్లి శ్రీధర్, బొబ్బిలి శ్రీను వీహెచ్‌ఏ సోనియ రైతులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణనాథుడి ఊరేగింపు


దెందులూరు: పోతునూరులో వినాయకుడిని ఊరేగిస్తున్న భక్తులు

దెందులూరు: గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా పోతునూరులో విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద 9 రోజుల పాటు విశేష పూజలందుకున్న స్వామివారి విగ్రహాన్ని బుధవారం నిమజ్జనం చేశారు. తొలుత ఆలయంలో లడ్డూ వేలం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, వందలాది మంది భక్తులు విఘ్నేశ్వరుని విగ్రహాన్ని ఊరేగించి నిమజ్జనం చేశారు.

వైభవంగా ఉద్వాసన పూజలు

భీమడోలు: భీమడోలులో వేంచేసియున్న శ్రీమన్మహా గణనాథుడి 59వ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ఉద్వాసన పూజా కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. 9 రోజుల పాటు భక్తులచే పూజలందుకున్న శ్రీమన్మహా గణనాధుని విగ్రహాన్ని సుందరంగా అలంకరించిన ఓ ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పురవీధుల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఊరేగించారు. విచిత్ర వేషధారణలతో కళాకారులు ఆకట్టుకున్నారు. గోదావరి కాలువలో విగ్రహాన్ని నిమజ్జనం చేసారు. మంగళవారం రాత్రి స్వామి వారికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూలను లాటరీ పద్ధతిలో డ్రా తీసారు.

ఉంగుటూరు కోనేరుపేటలో..

ఉంగుటూరు: స్థానిక కోనేరు పేట వినాయకుని విగ్రహ ఊరేగింపు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాలు, కోలాటం నడుమ వినాయకుని అలంకరించిన ట్రాక్టరుపై ఊరేగించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. కాలువగట్టు వినాయక విగ్రహాన్ని ఊరేగించారు. కైకరం, చేబ్రోలు, రాచూరు, గొల్లగూడెంలో ఊరేగింపు నిర్వహించి విగ్రహాలను కాలువల్లో నిమజ్జనం చేశారు.


భీమడోలు: ఆకట్టుకున్న విచిత్ర వేషధారణలు


భీమడోలు: శ్రీమన్మహా గణనాథుడి ఊరేగింపు

ప్రభుత్వ జీవోలను పంచాయతీలు అమలు చేయాలి


ఎ.గోకవరంలో రజకుల చెరువు విషయంపై సర్పంచి మిద్దే గంగమ్మతో మాట్లాడుతున్న కట్లయ్య

ఉంగుటూరు: రజకుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం విడుదల చేసిన జీవోను పంచాయతీ అధికార్లు అమలు చేయాలని రజక జన సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. బుధవారం ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు, ఎ.గోకవరం గ్రామాల్లో రజకుల సమస్యలపై కట్లయ్య పర్యటించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమై చర్చించారు. సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించిన సర్పంచి మిద్దే గంగమ్మ వెంకటేశ్వరరావు, కార్యదర్శి రవిచంద్రకుమార్‌కు కట్లయ్య కృతజ్ఞతలు తెలిపారు. చేబ్రోలులో రజకులకు మోటారు బోరు, ఉచిత విద్యుత్ కోసం గ్రామ పంచాయతీ తీర్మానం ఇవ్వడానికి తాము సిద్ధంగా ఉన్నామని సర్పంచి లక్ష్మీసునీత చెప్పారని కట్లయ్య తెలిపారు. జిల్లా రజక యూత్ కార్యదర్శి వితల శ్రీనివాసు, కోమంటి మురళి, జువ్వలపాలెం సత్యనారాయణ, కడెల్లి సుబ్బయ్య ఎ.గోకవరం రజక సంఘం నాయకడు నిడమర్తి సూర్య మాన్‌రాజు నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలపై వినతిపత్రం అందజేత

పెదవేగి : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెదవేగి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా పెదవేగి మండలానికి చెందిన అంగన్‌వాడీ మహిళలు స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు త్వరిగతిన పరిష్కరించారని డిమాండ్ చేశారు. అనంతరం పెదవేగి తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి పి ప్రసాద్ యూనియన్ నాయకులు నాయకత్వం వహించారు.

విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి సాధించడమే లక్ష్యం


భీమడోలు: పూళ్లలో టీచర్లకు బోధనలో మెలకువలను వివరిస్తున్న జిల్లా రిసోర్స్‌పర్సన్ పాశం పాండురంగారావు


పెదవేగి: ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ సీహెచ్ బుద్ధవాస్

భీమడోలు: విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధిని సాధించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు తన వంతు కృషి చేయాలని జిల్లా స్థాయి రిసోర్స్‌పర్సన్ పాశం పాండురంగారావు అన్నారు. పూళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో టీచింగ్ ఎట్ ది రైట్ లెవెల్ (టిరల్)పై రెండో రోజులు పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు బుధవారంతో ముగిసాయి. మండల పరిధిలోని టీచర్లకు రిసోర్స్‌పర్సన్ పాండురంగారావు శిక్షణ అందించారు. విద్యాబోధనలో మెలకువలను పాటించడం ద్వారా విద్యార్థులకు సరైన స్థాయి బోధన అందుతుందని, దీనితో వారిలో అభ్యసనా సామర్థ్యాలు మెరుగు పడతాయన్నారు. నాయకత్వ లక్షణాలపై వారం రోజుల పాటు నూజివీడులోని ఆగిరిపల్లిలో రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తుందని తెలిపారు. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత టీచర్లు శిక్షణ పొందిన అనుభవాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని టీచర్లు, హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలు పాల్గొన్నారు.

నూతన అంశాలు తెలుసుకోవాలి

పెదవేగి : ఉపాధ్యాయుడు నిత్యం ఏదొకటి తెలుసుకుంటూ నిత్య విద్యార్థిగా ఉన్నప్పుడే తాను చేసే వృత్తికి న్యాయం చేస్తాడని పెదవేగి ఎంఈవో సీహెచ్. బుధవాస్ అన్నారు. పెదవేగి మండలం విజయరాయి, పెదవేగి స్కూల్ కాంప్లెక్సు సమావేశాలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరాయిలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో బోధనోపకరణాల తయారీ, మోడల్ పాఠ్యాంశాలు వంటి వృత్తి పరమైన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకుంటూ విద్యార్థులకు నేర్పించాలన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో విజయరాయి, పెదవేగి జడ్పీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.వెంకట రమణ, టి.ఎడ్వర్డ్, రిసోర్స్‌పర్సన్ కె.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.